సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



చిగురిస్తున్న ఆశలు..

పీఎం స్వనిధి పథకం ద్వారా మున్సిపాలిటీల్లో వీధి వ్యాపారులకు రుణం ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు. IVలో



కొంత ఊరట..

జీఎస్టీలో వచ్చిన మార్పులు పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం కలిగించేదిగా ఉందని పలువురు చెబుతున్నారు. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
29° / 24°

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం తర్వాత ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మ పూజ చేశారు. మహిళా ఉద్యోగులతో కలిసి వివిధ రకాల తామర పుష్పాలు, రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించారు. సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ ఆడారు.

విదేశీ విద్యా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్ : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే ఎస్సీ విద్యార్థుల నుంచి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కింద అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు జి.జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. ఆసక్తి గల విద్యార్థులు నవంబర్ 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలు మించరాదని, ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ, జీఎంఏటీ, పీటీఈలలో ఏదో ఒక పరీక్షలో అర్హత సాధించి ఉండాలని, తప్పనిసరిగా పాస్ పోర్ట్ కలిగి ఉండాలని, గుర్తింపు పొందిన విదేశీ యూనివర్సిటీలో ప్రవేశం పొంది ఉండాలని వివరించారు.

అన్నం శ్రీనివాసరావుకు అవార్డు



వెంకయ్యనాయుడు, ఈటల, కేటీఆర్‌తో శ్రీనివాసరావు

ఖమ్మం అర్బన్ : హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహించిన అచీవ్‌మెంట్ అవార్డు–2025 కార్యక్రమంలో జిల్లాకు చెందిన అన్నం సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావుకు పురస్కారం దక్కింది. ఈ మేరకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోతుగంటి వెంకటేశ్వర్లు, గంధం పట్టాభి రామారావు, షేక్ నాగుల్‌మీరా, కేశవపట్నం శ్రీనివాస్, కడవెండి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎకో’ ఏమాయె..?



భద్రాచలం వద్ద ఏరు ఉత్సవంలో ఏర్పాటు చేసిన హట్స్

పర్యావరణ పర్యాటకంలో జిల్లాకు దక్కని చోటు

- అటవీ విస్తీర్ణంలో భద్రాద్రికి రెండో స్థానం
- ఏజెన్సీ ప్రాంతాలకు ఆదరణ కరువు
- పట్టించుకోని గిరిజన ప్రజాప్రతినిధులు

భద్రాచలం: ప్రకృతి అందాలు.. పచ్చని అడవులకు నెలవైన ఉన్న భద్రాద్రి జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి ఎంతో అవకాశం ఉంది. అడవుల విస్తీర్ణంలో రాష్ట్రంలోనే జిల్లా రెండో స్థానంలో నిలిచింది. అయినప్పటికీ ఎకో టూరిజం ప్రాజెక్టులో జిల్లాకు చోటు దక్కలేదు. ఎకో టూరిజంతో జిల్లా, గిరిజనుల అభివృద్ధికి అవకాశం ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, మంత్రులు చొరవ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అబ్బురపరిచే అటవీ అందాలు..

రాష్ట్ర విభజనకు ముందు అటవీ విస్తీర్ణంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మొదటి స్థానంలో ఉండేది. తెలంగాణ ఏర్పాటు తర్వాత 2021 ప్రభుత్వ లెక్కల ప్రకారం 21,214 చదరపు కిలోమీటర్ల మేర అడవులతో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. జిల్లాలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతం, సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. కిన్నెరసాని, మూసి, పాములేరు వంటి చిన్నచిన్న ఉపనదులు, దుమ్ముగూడెం, మూకమామిడి తదితర సాగునీటి ప్రాజెక్టులతో పాటు అభయారణ్యం ఉన్నాయి. అన్నింటికీ మించి దేశవ్యాప్తంగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఉంది. ఇలా అటవీ, ప్రకృతి, నదీ తీర అందాలతో జిల్లాకు ప్రత్యేక స్థానం ఉన్నప్పటికీ ఎకో టూరిజంలో చోటు దక్కకపోవడం శోచనీయమని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



దుమ్ముగూడెం పాత ఆనకట్ట వద్ద గోదావరి పరవళ్లు

ప్రజాప్రతినిధులకు పట్టింపేది..?

జిల్లాలోని అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం, ఇల్లెందు నియోజకవర్గాలకు గిరిజన ప్రజాప్రతినిధులే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఇక భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా నామినేటెడ్ పోస్టులో ఉన్నారు. మొత్తంగా ఐదుగురు గిరిజన ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ జిల్లాకు, గిరిజన యువతకు, ఏజెన్సీ ప్రాంతానికి వన్నె తెచ్చే ఎకో టూరిజంలో ఒక్క ప్రాజెక్టును సైతం మంజూరు చేయించలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని అటవీ, ప్రకృతి అందాలు, టూరిజం అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని జిల్లా వాసులు అంటున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కేబినెట్‌లో కీలక శాఖల్లో ఉన్నారని, వారికి అనుచరులుగా పేరొందిన ఆయా ఎమ్మెల్యేలు ఎకో ప్రాజెక్ట్‌ల అంశాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లలేకపోయారని విమర్శిస్తున్నారు.

కలెక్టర్ కొంతమేర ప్రయత్నించినా..

కలెక్టర్‌గా జితేష్ వి పాటిల్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎకో టూరిజం ఆవశ్యకతను గుర్తించారు. ఏరు ఉత్సవం పేరిట భద్రాచలం గోదావరి ఒడ్డున, జీడిగుప్పతో పాటు పలు ప్రాంతాల్లో ఆదివాసీ హట్స్ ఏర్పాటు చేశారు. అయితే వాటికి ఏడాది పాటు తగిన ఆదరణ, ప్రచారం లేకపోవడంతో ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. కిన్నెరసానిలో సైతం ఎకో టూరిజం అభివృద్ధికి ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సీతారామ, దుమ్ముగూడెం ఆనకట్ట తదితర ప్రాంతాల్లో తీగల వంతెన, కాటేజీలు నిర్మించాలని, ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు చొరవ చూపాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

సంతానలక్ష్మీ నమో నమః



సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా రెండో రోజైన బుధవారం శ్రీ లక్ష్మీతాయారమ్మవారు సంతానలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సంతాన అవరోధాలు తొలగించడంతో పాటు సుఖ సంతోషాలు ప్రసాదించాలని భక్తులు వేడుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు చేయగా, మధ్యాహ్నం సామూహిక కుంకుమార్చన గావించారు. మహిళా భక్తులు భారీగా పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, చిత్రకూట మండపంలో జరుగుతున్న శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేద పండితులు, అర్చకులు అయోధ్య కాండ పారాయణం చేశారు.

నేడు గజలక్ష్మి అలంకరణలో..

‘లక్ష్మీః దివ్యైః గజేంద్రై మణిగణఖచితైః స్నాపితా హేమకుంభై’ అని కీర్తించారు పూర్వాచార్యులు. ఈ అమ్మను ఆరాధిస్తే అధికారము, మహా సంపద కలుగుతాయని శాస్త్రం చెబుతోంది. గజలక్ష్మిని ఆరాధించే దేవేంద్రుడు త్రైలోకాధిపత్యాన్ని సాధించాడని, ఆ అమ్మను పూజిస్తే చెదరని అధికారం, తరగని సంపద కలుగుతాయని పండితులు అంటున్నారు.

శాస్త్రోక్తంగా రామయ్య నిత్యకల్యాణం

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బేడా మండపంలో బుధవారం వైభవంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

‘పేట’కే అదనంగా ఇళ్లు ఇచ్చాం



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

- ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మ గౌరవానికి ప్రతీక
- ప్రజా ప్రభుత్వంలో 11లక్షల రేషన్ కార్డులు పంపిణీ
- మరో మూడు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్రంలో అశ్వారావుపేట నియోజకవర్గానికే అదనంగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఇది స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పనితీరుకు నిదర్శమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం అశ్వారావుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సుంకవల్లి వీరభద్రరావు, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారం అనుభవించి రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఈ ఇళ్లు పేదలకు భరోసా, భద్రతతోపాటు ఆత్మ గౌరవానికి ప్రతీకలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల హామీ ప్రకారం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో తొలి విడతగా 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇస్తే అశ్వారావుపేటకు అదనంగా మరో 1000 ఇళ్లు మంజూరు చేశామని వివరించారు. రాష్ట్రంలో 11 లక్షల రేషన్ కార్డులు ఇవ్వగా, మరో 7 లక్షల కార్డుల్లో కుటుంబీకుల పేర్ల నమోదుకు అవకాశం కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మరో మూడు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, పేదల సొంతింటి కల సాకారం చేస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అశ్వారావుపేట నియోజకవర్గం ప్రత్యేకమని, హైదారాబాద్‌లో చాక్లెట్ కంపెనీకి అశ్వారావుపేటలో సాగు చేస్తున్న కోకో పంటను వినియోగిస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని చాక్లెట్ తయారీదారులే తనకు చెప్పారని, ఇది జిల్లాకే గర్వకారణమని అన్నారు. చేపల పెంపకానికి 500 యూనిట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆసక్తి ఉన్న వారు అధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్, ఆర్డీఓ మధు, జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, ఆత్మ కమిటీ డీపీడీ సరిత, మున్సిపల్ కమిషనర్ బి.నాగరాజు, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో రాతి నిర్మాణాలు చేపట్టాలి

దేవస్థాన వైదిక బృందం సూచన

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో చేపట్టే మాస్టర్ ప్లాన్‌లో భాంగంగా రాతి కట్టడాలతో నిర్మించాలని బుధవారం ఆర్కిటెక్ సూర్యనారాయణ మూర్తికి దేవస్థాన వైదిక కమిటీ సభ్యులు సూచించారు. దేవస్థానం క్యాంప్ కార్యాలయంలో వైదిక సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆలయ అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. ప్రధాన ఆలయంలో మార్పులు చేయకుండా ప్రాకార మండపం, యాగశాలలను పున్నర్మించాలని తెలిపారు. అలాగే ఆలయం చుట్టూ ప్రధాన రహదారులను విస్తరించి నలువైపులా స్వామివారి రథం తిరిగేలా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్కిటెక్ సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. గతంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచనలతో పాటు దేవస్థాన వైదిక సిబ్బంది అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో ఈఓ దామోదర్‌రావు, ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు (రామం), ఉప ప్రధానార్చకులు అమరవాది గోపాల కృష్ణమాచార్యులు, కోటి రామస్వరూప్, వేద పండితులు గుదిమెళ్ల మురళీ కృష్ణమాచార్యులు, రామాయణ పారాయణదారు ఎస్టీజీ కృష్ణమాచార్యులు, అసిస్టెంట్ ఇంజనీర్ అజయ్, సీసీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలం రామాలయం

గర్భిణులు రక్తపరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

చుంచుపల్లి: గర్భిణులు హిమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి సూచించారు. తమ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పీహెచ్‌సీ స్థాయిలోనే ప్రసవాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, గర్భిణుల ఏఎన్‌సీ నమోదు 100 శాతం సాధించాలని అన్నారు. ప్రాథమిక స్థాయిలో ఆరోగ్య సేవల మెరుగుదల కోసం నిబద్ధతతో పనిచేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. కాగా, సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ తొలుత పలు సూచనలు చేశారు. డాక్టర్లు మధువరణ్, స్పందన, తేజస్వి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌ను సందర్శించిన అదనపు డీజీపీ

చుంచుపల్లి: చాతకొండ 6వ బెటాలియన్‌ను టీజీఎస్పీ బీఎన్ అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో చేపట్టిన డైనింగ్ హాల్, జిమ్ రూమ్, పార్కింగ్ షెడ్, బుద్ధ విగ్రహం, ఓపెన్ జిమ్, క్రీడా మైదానం, ఎస్‌డీఆర్‌ఎఫ్ ఆఫీస్ రూమ్, అకమిడేషన్ హాళ్లను ప్రారంభించారు. అనంతరం బెటాలియన్ సిబ్బందితో వసతుల కల్పనపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి, అదనపు కమాండెంట్ బి.వెంకటేశ్వర రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్‌లు జి.వి కిరణ్‌కుమార్, సింగరేణి వెల్ఫేర్ జీఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న అధికారులు

గెలల తరుగులో వివక్ష?

- ఒక్కో రైతుకు ఒక్కోలా నిర్ణయం
- ఆయిల్‌ఫెడ్ అధికారుల తీరుపై విమర్శలు

అశ్వారావుపేట: అధిక వర్షాలకు ఆయిల్‌పామ్ గెలల దిగుబడి పెరగడంతో ఆయిల్‌ఫెడ్ అధికారులు తరుగు తీయడంలోనూ వివక్ష చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దమ్మపేట మండలం అప్పారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వద్ద మల్లారెడ్డి రమణమూర్తి అనే రైతు తనకు ఎక్కువ తరుగు తీశారని ఆరోపిస్తూ గత సోమవారం ఫ్యాక్టరీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీనిపై పలువురు రైతులు, ఆయిల్‌ఫెడ్ అధికారులు పలు విధాలుగా స్పందిస్తున్నారు. ఆయిల్‌ఫెడ్‌లో గెలలను స్క్రీనింగ్ చేసే పటిష్టమైన వ్యవస్థ లేకపోవడం ఇలాంటి ఘటనలకు కారణమవుతోంది. మలేషియా వంటి దేశాల్లో ఆయిల్‌పామ్ ఉత్పత్తి అధికంగా ఉన్నా.. వేలాది టన్నుల గెలలు వచ్చినా.. స్క్రీనింగ్ పటిష్టంగా ఉంటుందని, కానీ ఇక్కడ క్షేత్రస్థాయి సిబ్బంది లేకపోవడం, ఫ్యాక్టరీలో స్క్రీనింగ్ సమయం, విశాలమైన ప్లాట్‌ఫాం లేకపోవడంతో ఇలాంటి ఆరోపణలకు ఆస్కారం లభిస్తోందని చెబుతున్నారు. ఫ్యాక్టరీకి గెలలను తెచ్చే వారికి ఉండే పలుకుబడిని బట్టి అధికారులు వివక్ష చూపుతూ తరుగు తీస్తున్నారని కొందరు రైతులు వాపోతున్నారు. అసలు తరుగును నిర్ణయించేందుకు నిర్దిష్ట ఫార్ములా ఉందా అని ప్రశ్నిస్తున్నారు.



ఫ్యాక్టరీకి తరలించిన పచ్చిగెలలు

నరికేటప్పుడు జాగ్రత్త పడితే..

సన్న, చిన్నకారు రైతులు మాత్రమే క్షేత్రాలకు వెళ్లి గెలల కటింగ్‌ను దగ్గరుండి చేయిస్తుంటారు. పదెకరాలకు మించి సాగు చేసే రైతులు, పదుల ఎకరాల్లో కౌలుకు తీసుకునే రైతులు అన్ని క్షేత్రాల్లో ఒకేసారి గెలలను ముఠా ద్వారా నరికిస్తుంటారు. యజమాని అందుబాటులో లేని చోట్ల గెలల నరికివేతలో వ్యత్యాసాలు వస్తుంటాయి. ముఠాకు టన్నుల చొప్పున నగదు చెల్లిస్తున్నందున అధిక బరువు వచ్చేలా వ్యవహరించడం ఓ కారణమని కొందరు అభిప్రాయపడుతున్నారు. తరుగు తీసే విషయమై అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీల మేనేజర్లు నాగబాబు, కళ్యాణ్‌ను వివరణ కోరగా.. రైతుల పట్ల ఎలాంటి వివక్ష ఉండదని, డ్రైవర్లు, రైతులకు గెలలను చూపించిన తర్వాతే తిరస్కరిస్తున్నామని తెలిపారు. పనికిరాని గెలలను అనుమతిస్తే అంతిమంగా రైతులతోపాటు ఫెడరేషన్ మనుగడకు ముప్పు ఉంటుందని చెప్పారు.

నిబంధనలేవీ?

ఆయిల్‌పామ్ గెలల్లో తరుగుకు నిర్దిష్టమైన నిబంధనలేమీ ఉండడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. సీజన్ కాబట్టి కంటి చూపుతో ఓ అంచనా ప్రకారం గెలల తేడాను బట్టి తరుగు విధిస్తుంటారు. ఓ ట్రాక్టర్‌కు 5టన్నుల గెలలు వస్తే అత్యధికంగా 50 కిలోలు తరుగు రాస్తారు. చాలా తక్కువ సందర్భాల్లో 70 కిలోలు రాస్తుంటారు. పైకి 1శాతం అయినా రైతుకు జరిగే నష్టం రూ.వెయ్యి. అందుకే రైతుల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కొక్కరికి ఒక్కోలా కాకుండా సరాసరి తరుగు అందరికీ వర్తింపజేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

శరవేగంగా రిటైనింగ్ వాల్

- పనుల ప్రగతిపై మంత్రులు పొంగులేటి, తుమ్మల పర్యవేక్షణ
- వరంగల్ ఎన్ఐటీ నిపుణులతో నాణ్యతా పరీక్షలు
- భూసేకరణ ప్రక్రియ వేగవంతం
- ఇరువైపులా సర్వీస్ రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థ



మున్నేరు వద్ద నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్

సాక్షిప్రతినిధి, ఖమ్మం : మున్నేరుకు వరద వస్తే పరీవాహకంలోని ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ ప్రాంతాల్లో మున్నేరు ప్రభావంతో అనేక కాలనీలు వరద ముంపునకు గురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.525.36 కోట్ల వ్యయంతో మున్నేరుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మిస్తుండగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత రెండేళ్లుగా క్లౌడ్ బరస్ట్‌తో వస్తున్న వరదలతో మున్నేటి పరీవాహక ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ప్రతి ఏటా నష్టాన్ని ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయితే వారు ఊపిరి పీల్చుకుంటారు.

తీరని నష్టం..

గత రెండేళ్లుగా మున్నేరుకు వచ్చిన వరదలతో ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ ప్రాంతాల్లోని కాలనీలు నీట మునిగాయి. అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. రోజువారీ పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకునే వారు సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. ఇక రోడ్లు, విద్యుత్ స్తంభాలు, సబ్ స్టేషన్లు, పాఠశాల భవనాలు, పైపు లైన్లు, ఆరోగ్య కేంద్రాలు దెబ్బతిన్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో సంభవించిన క్లౌడ్ బరస్ట్‌తో మున్నేరుకు వచ్చిన ఆకస్మిక వరదతో ప్రభుత్వ మౌలిక సదుపాయాలకు రూ. 757 కోట్ల నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. ఆ సమయంలో వరద ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. మున్నేరుకు రిటైనింగ్ వాల్ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రూ.525 కోట్లతో..

నగరం మధ్య నుంచి మున్నేరు వాగు ప్రవహిస్తోంది. పరీవాహక ప్రాంతం, నగరం నుంచి వచ్చే వరద గరిష్ట స్థాయిని దృష్టిలో ఉంచుకుని మున్నేరు వాగుకు రెండు వైపులా సిమెంట్ కాంక్రీట్‌తో రక్షణ గోడ నిర్మాణానికి ప్రభుత్వం రూ.525.36 కోట్లు మంజూరు చేయగా నిర్మాణ పనులను ప్రారంభించారు. మున్నేరు వాగుకు రెండు వైపులా ఖమ్మం రూరల్ మండలంలో 8.5 కిలోమీటర్లు, ఖమ్మం అర్బన్ మండలంలో 8.5 కిలోమీటర్లు.. మొత్తం 17 కిలోమీటర్లు పొడవునా 10 నుంచి 15 మీటర్ల ఎత్తుతో రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతోంది. ఇక సర్వీసు రోడ్డు, డ్రైయినేజీ వ్యవస్థ సదుపాయంతో ప్రారంభించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. పనుల నాణ్యతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండగా వరంగల్ ఎన్ఐటీ నిపుణులతో తనిఖీ చేయిస్తోంది.

మంత్రుల పర్యవేక్షణలో..

రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు. ఖమ్మం అర్బన్ మండలంలో మల్లెమడుగు, దానవాయిగూడెం, బుర్హాన్ పురం, ఖమ్మం, రూరల్ మండలం పోలేపల్లి, గోళ్లపాడు, గుదిమల్ల, గుర్రాలపాడు, ఏదులాపురం గ్రామాలకు చెందిన మొత్తం 245.12 ఎకరాల భూసేకరణలో 106.21 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. 138.31 ఎకరాల పట్టా భూమిలో ఇప్పటివరకు 69.12 ఎకరాల సేకరణ పూర్తయింది. భూ సేకరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. నిర్వాసితులకు పరిహారంతో పాటు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో 139.27 ఎకరాల్లో లేఔట్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందులో 1,666 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించనున్నారు. అన్ని మౌలిక వసతులతో మోడల్ కాలనీగా ఇది అభివృద్ధి చెందనుంది.

క్లుప్తంగా

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


చిన్నారితో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

పినపాక: వివిధ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యంగా ఉండాలని, నిరంతరం అధికారులు పర్యవేక్షించాలని ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. వంట చెరకు, మరుగుదొడ్లు, విద్యార్థుల గదులను పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, అనుకున్న సమయానికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ ఎస్కే సైదులు, డీఈ నాగేశ్వరచారి, ఏఈ సత్యశ్రీనివాస్, ఎంఈఓ నాగయ్య పాల్గొన్నారు.

కోర్టుకు హాజరుకాని ఇద్దరు అరెస్ట్

సుజాతనగర్: కోర్టు వాయిదాలకు హాజరుకాని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి జైలుకు తరలించిన ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం .రమాదేవి కథనం మేరకు.. మండలంలోని సీతంపేటబంజర గ్రామానికి చెందిన బాదావత్ మాన్య, కోమటిపల్లి గ్రామానికి చెందిన భూక్యా సురేశ్‌పై గతంలో కేసు నమోదైంది. అయితే వీరిద్దరూ వాయిదాల నిమిత్తం కోర్టుకు హాజరుకావడం లేదు. దీంతో కొత్తగూడెం సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జారీ చేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్‌పై ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి సబ్ జైలుకు తరలించామని తెలిపారు.

'గంజాయి' నిందితుల ఆస్తుల జప్తు

పినపాక: నిషేధిత గంజాయిని అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నిందితుల ఆస్తులను జప్తు చేస్తున్నట్టు ఈ–బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. 2024 జూన్ 29న ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితులపై ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ నిర్వహించగా, వారి పేర్లపై ఉన్న ఒక ట్రాక్టర్, ఒక కారు, ఒక ఆటో, నాలుగు మోటార్ సైకిళ్లు, మూడు గృహాలను ఫ్రీజ్ చేయించామన్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.23.52లక్షలుఅని పేర్కొన్నారు. గంజాయి అక్రమరవాణా ద్వారాసంపాదించిన డబ్బుతో నిందితులు, వారి బంధువుల పేర్లపై కొనుగోలు చేసిన ఆస్తులను కూడా జప్తు చేశామని సీఐ వివరించారు. కాగా, సీఐ వెంకటేశ్వరరావు, సిబ్బందిని ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు.

నాటుసారా స్వాధీనం

బూర్గంపాడు: మండలంలో బుధవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది జరిపిన దాడుల్లో 7 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. పినపాక పట్టీనగర్, అంజనాపురం, మోరంపల్లిబంజర, నాగినేనిప్రోలు, సారపాకల్లో నిర్వహించిన దాడుల్లో నాటుసారా విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశామని వారిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఎస్‌ఐ గౌతమ్ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది రామకృష్ణ, సుమన్, హబీబ్‌పాషా, గురవయ్య, రమేశ్, శ్రావణి పాల్గొన్నారు.

ఫ్యామిలీడే ఘనంగా నిర్వహించాలి

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఫ్యామిలీడే, బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించాలని సేవా సమితి అధ్యక్షురాలు ఈసం రమ కోరారు. బుధవారం ఇల్లెందులోని సింగరేణి హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 29న ఫ్యామిలీ డే వేడుకలు, సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సుధాకర్, అజయ్, సులక్షణ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

కొంత ఊరట..


ద్విచక్ర వాహనాల షోరూం వద్ద అమ్మకానికి పెట్టిన వాహనాలు

నిత్యావసరాలపై జీఎస్టీ తగ్గింపు

- పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం
- జీవిత, ఆరోగ్య బీమాతో పాటు ఔషధాల ధరల్లో మార్పులు
- ఆఫర్లతో హడావుడి చేస్తున్న షోరూంలు



ఓ దుస్తుల షోరూం వద్ద హోర్డింగ్

ఖమ్మంగాంధీచౌక్: వస్తు సేవా పన్ను (జీఎస్టీ)ల్లో వచ్చిన మార్పులు పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం కలిగించేదిగా ఉందని పలువురు చెబుతున్నారు. వివిధరకాల వస్తువులపై శ్లాబ్‌లను జీఎస్టీ కౌన్సిల్ 2.0 పేరిట మార్పు చేసింది. కేంద్ర ప్రభుత్వం 2017లో పరోక్ష పన్ను విధానాలను తొలగించి జీఎస్టీని రూపొందించి అమలు చేసింది. వివిధరకాల వస్తువులకు జీఎస్టీ శ్లాబ్‌లను విధించింది. ఇప్పుడు జీఎస్టీ కౌన్సిల్ మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఉన్న 12 శాతం, 28 శాతం పన్ను రేట్లను తొలగించారు. ఆ స్థానంలో 5, 18, 40 శాతం శ్లాబ్‌లు అమలు చేయనున్నారు. దీంతో నిత్యావసరాలపై పన్నులభారం తగ్గనుండగా, విలాసవంతమైన వస్తువుల ధరలు పెరగనున్నాయి.

ధర తగ్గిన కిరాణా సరుకులు

గతంలో 12 శాతం, 18 శాతం 28 శాతం వరకు శ్లాబ్ రేట్లతో ఉన్న పలు రకాల సరుకులు 5 శాతానికి తగ్గాయి. వెన్న, నెయ్యి, పాలు వంటివి 12.5 శాతం నుంచి 5 శాతానికి, బిస్కెట్లు, కేక్‌లు వంటివి 18 శాతం నుంచి 5 శాతానికి, ఆహార పదార్థాలతో పాటు జ్యూస్, మిల్క్ డ్రింక్స్ వంటివి 28 శాతం నుంచి 5 శాతానికి తగ్గాయి. 375 రకాల ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. టీవీల(సైజును బట్టి)పై ఉన్న 28 శాతం జీఎస్టీని 18 శాతం కన్నా తక్కువకు, సిమెంట్, ఇతర బిల్డింగ్ మెటీరియల్‌కు జీఎస్టీని తగ్గించారు.

బీమాకు మినహాయింపు

జీవిత, ఆరోగ్య బీమాలకు జీఎస్టీ కౌన్సిల్ పూర్తిగా పన్నుల మినహాయింపు కలిగించడంతో పాలసీ ప్రీమియం ధరలు తగ్గుతాయి. ఇప్పటి వరకు 18 శాతం జీఎస్టీ అమలులో ఉంది. సింగిల్ ప్రీమియం , బీమా రక్షణ చార్జీలపై కూడా జీఎస్టీ మినహాయింపు ఇచ్చారు. ఔషధాలపై జీఎస్టీ తగ్గించారు. గుండె జబ్బులు, కేన్సర్, జన్యు పరమైన వ్యాధులకు సంబంధించిన మందులపై జీఎస్టీని పూర్తిగా మినహాయించగా, 12 శాతం పరిధిలో ఉన్న పలు రకాల ఔషధాల శ్లాబ్ రేట్‌ను 5 శాతానికి తగ్గించారు.

విలాస వస్తువులపై బాదుడు

విలాసవంతమైన పలు రకాల వస్తువులపై జీఎస్టీ శ్లాబ్‌ను అమాంతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. సిగరెట్లు, గుట్కా, పాన్‌మసాలా, నికోటిన్ ఉత్పత్తులు 28 శాతం నుంచి 40 శాతానికి పెంచారు. కార్బొనేటెడ్, ఎనర్జీ, కెఫిన్ ఆధారిత డ్రింక్స్‌పై జీఎస్టీ 40 శాతానికి పెంచారు. లాటరీ టికెట్లు, కేసినో సేవలు, ఆన్‌లైన్ గేమింగ్‌పై పన్ను రేట్లను 40 శాతానికి పెంచారు. కార్లలో 1500 సీసీ కన్నా అధిక సామర్థ్యం ఉన్న వాటికి ఇకపై 40 శాతం జీఎస్టీ అమలవుతుంది. మోటారు సైకిల్ వాహన ధరలు కొంత మేర తగ్గనున్నా యి. కాగా, జీఎస్టీ తగ్గింపుతో సామగ్రి, వాహనాలు, బ్రాండెడ్ దుస్తుల ధరలు తగ్గాయంటూ వివిధ కంపెనీల షోరూంల వద్ద ఫ్లెక్సీలు కట్టి ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. దసరా సమీపిస్తుండడంతో కొనుగోళ్లు పెరగనుండగా.. జీఎస్టీ తగ్గింపుతో మార్కెట్ ఊపందుకుంటుందనే భావన వ్యక్తమవుతోంది.

వ్యాపార వృద్ధికి తోడ్పాటు



జీఎస్టీలో శ్లాబ్‌ల మార్పు మంచి పరిణామం. చిన్న పరిశ్రమలు, చిరు వ్యాపారాలకు ప్రయోజనం. వ్యాపార వృద్ధి జరుగుతుంది. 12 శాతం, 28 శాతం శ్లాబ్‌లను తొలగించి 5 శాతం శ్లాబ్‌లను విధించటం ద్వారా ధరలు దిగివచ్చే అవకాశం ఉంది. చిరు వ్యాపారాలు పుంజుకునే అవకాశం ఉంది. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

–చిన్ని కృష్ణారావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, ఖమ్మం

సాధారణ ప్రజలకు ప్రయోజనం



జీఎస్టీ కౌన్సిల్ శ్లాబ్‌ల మార్పుపై తీసుకున్న నిర్ణయం సాధారణ ప్రజలకు ప్రయోజనకరం. ఆహార పదార్థాలు, కిరాణా సరుకులపై శ్లాబ్ రేట్లను 5 శాతానికి తగ్గించటం ద్వారా ఆయా సరుకుల ధరలు తగ్గుతాయి. ఈ పరిణామం పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు మేలు చేకూర్చుతుంది.

–మెంతుల శ్రీశైలం, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి, ఖమ్మం

గ్రానైట్స్‌పైనా తగ్గిస్తే..



జీఎస్టీ శ్లాబుల్లో మార్పులు తీసుకురావడం శుభపరిణామం. గ్రానైట్ పరిశ్రమల్లో వినియోగించే ముడిసరుకు, మరమ్మతుల పరికరాలకు జీఎస్టీ నూతన మార్పుల్లో ధరలు తగ్గనున్నాయి. పరిశ్రమల్లో తయారైన గ్రానైట్‌కు అమలు చేస్తున్న 18 శాతాన్ని 5శాతానికి తగ్గిస్తే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఇబ్బందుల నుంచి గట్టెక్కేఅవకాశంఉంది.–తిరుపతి వెంకట్రామయ్య, గ్రానైట్స్ యజమాని, ముదిగొండ

చెల్లింపుదారులకు ఉపశమనం



జీఎస్టీ 2.0 సంస్కరణలు ప్రతి పన్ను చెల్లింపుదారుడికి ఉపశమనాన్ని కలిగిస్తుంది. సాధారణ ప్రజలకు జీవన వ్యయం తగ్గిస్తుంది. వ్యాపార వర్గానికి పన్ను సరళీకరణ లభిస్తుంది. నూతన జీఎస్టీ శ్లాబ్ విధానంలో వ్యాపార సౌలభ్యం పెరగటంతో పాటు ఆర్థిక చక్రం బలపడుతుంది.

–ఉల్లిబోయిన సైదులు, అధ్యక్షుడు, జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్

చేప పిల్లల ధరలు ఖరారు

- ముగ్గురు కాంట్రాక్టర్ల ద్వారా చేప పిల్లల పంపిణీకి నిర్ణయం
- పెద్ద చేప పిల్ల రూ.1.70, చిన్న చేప పిల్ల 68 పైసలుగా నిర్ణయం



ఖమ్మంవ్యవసాయం: చేప పిల్లల ధరలను నిర్ణయించారు. జిల్లాలో చేప పిల్లల పంపిణీకి ఏడుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేశారు. నిబంధనల మేరకు ఆయా కాంట్రాక్టర్ల చేప పిల్లల అక్వాఫామ్‌లు, హేచరీస్‌లను జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, పశుసంవర్ధక, పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎంఏ రాజు, చీఫ్ ప్రమోటర్ మామిడి వెంకటేశ్వర్లుతో కూడిన బృందం పరిశీలించింది. ఈ పరిశీలన ద్వారా ముగ్గురు కాంట్రాక్టర్లు నిర్వహించే హేచరీస్‌లను ఎంపిక చేశారు. జస్వంత్ ఆక్వాఫామ్, మచిలీపట్నం, నరేంద్ర హేచరీస్ ఆకివీడు, పశ్చిమగోదావరి జిల్లా, సత్యకృష్ణ ఆరేటి కంపెనీ, కాళ్ల బీమవరం, పశ్చిమ గోదావరి జిల్లాలను చేప పిల్లల పంపిణీకి ఎంపిక చేశారు. ఈ మూడు కంపెనీల ఫైనాన్షియల్ బిడ్‌లను పథకం డిప్యూటీ చైర్మన్, జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి సమక్షంలో ఓపెన్ చేశారు.

ధరలు ఇలా..

ఉచిత చేప పిల్లల పథకం కింద పంపిణీ చేసే చేప పిల్లలకు కాంట్రాక్టర్లు కోడ్ చేసిన వాటిలో తక్కువ ధరలను కమిటీ నిర్ణయించింది. 80–100 మి.మీ ఒక్కో చేప పిల్లకు రూ.1.70, 35 – 40 మి.మీ ఒక్కో చేప పిల్లకు 68 పైసల చొప్పున ఖరారైంది.

ఈ ఏడాది జిల్లాలో 882 జలాశయాల్లో చేప పిల్లల విడుదలకు మత్స్యశాఖ ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా 80–100 మి.మీల చేప పిల్లలు 2.11 కోట్లు కాగా, 35–40 మి.మీల చేప పిల్లలు 1.38 కోట్లను పంపిణీ చేయనున్నారు. ఈ పిల్లలకు సుమారు రూ.4 కోట్ల వరకు కేటాయించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద కట్ల, రోహు, బంగారుతీగ రకాల చేప పిల్లలను ఎంపిక చేశారు.

ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో పంపిణీ

రాష్ట్రంలో కెల్లా ఖమ్మం జిల్లాలో చేప పిల్లల టెండర్ల ప్రక్రియ, ఫైనాన్షియల్ బిడ్ వంటి ప్రక్రియలు పూర్తయ్యాయి. ఈ ప్రక్రియల నివేదికలను జిల్లా యంత్రాంగం రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్‌కు పంపించారు. ఇప్పటికే జలాశయాల్లో సమృద్ధిగా నీరుంది. చేప పిల్లల విడుదలకు అనుకూలంగా ఉంది. ప్రభుత్వం చేప పిల్లల పంపిణీకి, జలాశయాల్లో విడుదలకు అనుమతులు ఇస్తే జిల్లాలో ఈ పంపిణీ ప్రక్రియను వెంటనే చేపట్టే అవకాశం ఉందని జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు.

కూకటి వేళ్లతో పెకిలిస్తాం..

భూస్వామ్య పెత్తందారులకు మావోయిస్టుల హెచ్చరిక లేఖ

చర్ల: భూస్వామ్య పెత్తందారుల ఆగడాలను కూకటి వేళ్లతో పెకిలిస్తామని, విప్లవోద్యమాన్ని కొనసాగిస్తామని మావోయిస్టు పార్టీ మరో లేఖను విడుదల చేసింది. మావోయిస్టు భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ పేరిట బుధవారం ఒక లేఖ విడుదలైంది. ఈ నెల 18న భూస్వాములు, వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లతో పాటు ఒక విలేకరిని హెచ్చరిస్తూ విప్లవ పేరుతో మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ ఒక లేఖను విడుదల చేసింది. తర్వాత ఈ నెల 22న మావోయిస్టు పార్టీ అచ్చన్న పేరుతో భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ పేరిట మరో లేఖను విడుదల చేసి సెప్టెంబర్ 18న విడుదల చేసిన లేఖతో మావోయిస్టు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, అది బూటకమని, కొందరు పనిగట్టుకొని ప్రజలను గందరగోళానికి గురి చేసేందుకే విడుదల చేశారని మావోయిస్టు పార్టీ ఆ లేఖలో వెల్లడించింది. మళ్లీ ఈ లేఖకు కౌంటర్‌గా భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ విప్లవ పేరుతో మరో లేఖ విడుదల కాగా ఈ లేఖలో మరోమారు భూస్వాములు, పెత్తందారులు, రాజకీయ నాయకులతో పాటు విలేకరిని పార్టీ తీవ్రంగా హెచ్చరించింది. డివిజన్ కమిటీ పేరుతో విడుదలైన లేఖ వాస్తవమేనని, అది మా పార్టీయే విడుదల చేసిందని, బూటకపు ఉద్యమాలు చేస్తూ బూటకపు లేఖలు రాసే సంస్కృతి విప్లవకారులకు లేదని, కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. అయితే, వరుసగా విడుదలవుతున్న లేఖలపై తీవ్ర గందగోళం నెలకొనగా.. రాజకీయ నాయకులు, భూస్వాములు, వ్యాపారులతో పాటు పోలీసు వర్గాలూ తలలు పట్టుకుంటున్నాయి. ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకునేందుకు నిఘావర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

హత్య కేసు నిందితుల అరెస్ట్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం గణేశ్‌టెంపుల్ ఏరియాలో ఈ నెల 22వ తేదీన జరిగిన హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వివరాలు వెల్లడించారు. గణేశ్‌టెంపుల్ ఏరియాలో గుబ్బల రాంమోహన్‌రావు (62) ఇంట్లో రాత్రి టిఫిన్ చేస్తున్న సమయంలో రామవరానికి చెందిన మహ్మద్ షాహీర్ బండరాయిలను పగలగొట్టే సుత్తితో ఇంట్లోకి ప్రవేశించాడు. రాంమోహన్‌రావుపై దాడి చేయగా.. ఆయన భయంతో బయటకు పరుగెత్తడంతో షాహీర్ కూడా బయటకు వెళ్లి తలపై సుత్తితో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం డ్రెయినేజీలో సుత్తి పడేసి.. అక్కడే వేచి ఉన్న వాసంపల్లి వంశీ ద్విచక్రవాహనంపై రామవరానికి వెళ్లాడు. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితులు మహ్మద్ షాహీర్, వాసంపెల్లి వంశీ పోలీసులు పట్టుకున్నారు. అయితే, ఓ వివాహితతో అక్రమ సంబంధం కారణంగా షాహీర్.. రాంమోహన్‌రావును చంపినట్లు పోలీసులు నిర్ధారించారు. సదరు వివాహితపై కూడా కేసు నమోదు చేస్తామని, వీరందరిని గురువారం రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ వెల్లడించారు. కాగా, ఇద్దరు నిందితులపై రౌడీషీట్ తెరుస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో సీఐలు శివప్రసాద్, కరుణాకర్, ప్రతాప్, ఎస్‌ఐ విజయ, పోలీసులు పాల్గొన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్

వివాహిత అదృశ్యం


స్వప్న

ములకలపల్లి: వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మధుప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని వేపలగడ్డ గ్రామానికి చెందిన కొంగల స్వప్న ఈ నెల 15న ములకలపల్లి ఆస్పత్రికి వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితులను విచారించినా జాడ తెలియక పోవడంతో ఆమె భర్త సుధాకర్ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ మోసానికి గురైన రైతు

జూలూరుపాడు: సైబర్ నేరగాళ్ల వలలో పడి రైతు భూక్యా కిషన్ రూ.10 వేలు కోల్పోయిన ఘటన మండలంలోని సాయిరాంతండాలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మూడు రోజులుగా గుర్తుతెలియని వ్యక్తి కిషన్ సెల్ నంబర్‌కు ఫోన్ చేస్తున్నాడు. బ్యాంకు ఖాతా నిలిపివేసే అవకాశం ఉందని, వివరాలు సరిగ్గా లేవని, వివరాలు చెప్పమని తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో అడిగాడు. బుధవారం ఉదయం మళ్లీ గుర్తుతెలియని వ్యక్తి కిషన్ సెల్‌కు ఫోన్ చేయగా, అతడి భార్య వాలి మాట్లాడింది. తాను హెడ్ ఆఫీస్‌లో ఉద్యోగినని, తన పేరు ఆకాష్‌వర్మ అని, ఐడీ కార్డు, పాన్ కార్డును వాట్సాప్ ద్వారా పంపించాలని వాలిని అడిగాడు. బ్యాంకు ఉద్యోగి అని నమ్మిన వాలి.. అతడు చెప్పినట్లు చేయడంతోపాటు మొబైల్‌కు వచ్చిన ఐదు అంకెల ఓటీపీ నంబర్ చెప్పింది. దీంతో కిషన్ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.10 వేలు విత్‌డ్రా అయినట్లుగా ఫోన్‌కు క్షణాల్లో మెసేజ్ రావడంతో వాలి కంగుతిన్నది. వెంటనే వాలి, తన భర్త కిషన్ బ్యాంకు వద్దకు వెళ్లి అధికారులు చెప్పారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

'సారథి' సతాయిస్తోంది..

సత్తుపల్లిటౌన్: రవాణా శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన యాప్ వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తోంది. టీజీట్రాన్స్‌పోర్ట్ స్థానంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సారథి యాప్ సతాయిస్తోంది.

కొత్త లైసెన్సు కోసం లెర్నింగ్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్సు, లైసెన్సు రెన్యూవల్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంది. గతంలో స్లాట్ బుక్ చేస్తే ఒకే ఓటీపీ వచ్చేది. ఇప్పుడు ఐదు నుంచి ఏడు ఓటీపీలు వస్తుండటంతో వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. రెండు నిమిషాల్లో అయిపోయే ఈ ప్రక్రియ కోసం గంటల తరబడి కార్యాలయంలో పడిగాపులు పడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయమై రవాణాశాఖ అధికారి జేఎస్ శ్రీనివాసరావును వివరణ కోరగా యాప్ నూతనంగా ప్రవేశపెట్టారని, సమస్యనుఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.


సత్తుపల్లి రవాణాశాఖ కార్యాలయంలో వాహనదారులు

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ


వరి పొలాన్ని పరిశీలిస్తున్న మధిర ఏడీఏ విజయ్ చంద్ర

చింతకాని: పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలుచేపట్టాలని మధిర వ్యవసాయ సహాయ సంచాలకుడు విజయ్ చంద్ర పేర్కొన్నారు. చింతకానిలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించిన వరి పొలాలను బుధవారం పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వరిలో ఆకు ఎండు తెగులు ఆశిస్తున్నందున కొంతమేర నివారణకు ప్లాంటమైసిన్ లేదా పోషమైసిన్ 0.2 గ్రాములు లేదా అగ్రిమైసిన్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే వరిపంట పూతదశలో ఉన్నప్పుడు కాపర్ శిలీంద్రనాశినులను పిచికారీ చేయొద్దని తెలిపారు. వరిపంటకు ఆఖరి దశగా పొటాష్ ఎరువును ఎకరానికి 15–20 కేజీలు వేయాలని, పొలంలో పాత నీరు తీసి కొత్త నీరు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి సోములపల్లి మానస, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు కన్నుమూత


సీతారావమ్మ (ఫైల్)

సత్తుపల్లి: మండలంలోని రేజర్ల గ్రామానికి చెందిన జలగం వెంగళరావు అనుచరుడు చింతల గోపిరెడ్డి భార్య సీతారావమ్మ (108) మంగళవారం రాత్రి కన్నుమూశారు. ఈ సందర్భంగా పలువురు సంతాపం తెలిపారు.

విక్రమ్‌నగర్‌లో వ్యక్తి మృతదేహం లభ్యం


రవి మృతదేహం

కొణిజర్ల: మండలంలోని విక్రమ్‌నగర్‌లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సూరజ్ కథనం ప్రకారం.. విక్రమ్‌నగర్ మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్ కింద గడ్డిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సూరజ్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీయగా మృతుడు రఘునాథపాలెం మండలం కోటపాడు గ్రామానికి చెందిన బలంతు రవి (35)గా గుర్తించారు. మృతుడు ఈ నెల 22న ఖమ్మం అర్బన్ మండలం ఖానాపురం హవేలీ ఇండస్ట్రియల్ ఏరియాలో ఓ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడిగా గుర్తించారు. హత్యాయత్నం చేసిన తర్వాత భయంతో పారిపోయి విక్రమ్‌నగర్ చేరుకుని అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు గుర్తించలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువజన నాయకుడి మృతి


సాజిద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ


సాజిద్ (ఫైల్)

చండ్రుగొండ: మండల కేంద్రానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు మొహమ్మద్ సాజిద్ అలియాస్ సజ్జు (28) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సాజిద్‌కు కొన్నేళ్ల క్రితం కొత్తగూడేనికి చెందిన యువతితో వివాహమైంది. ఏడు నెలల కిందట దంపతులకు కుమారుడు పుట్టాడు. ప్రస్తుతం బాలుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. చూసేందుకు సాజిద్ తన ద్విచక్రవాహనంపై కొత్తగూడెం పయనమయ్యాడు. రుద్రంపూర్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన జాజిద్‌ను కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని, ఆరాతీశారు. సాజిద్ మరణం బాధాకరమని, ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి


మధుసూదన్ (ఫైల్)

కొత్తగూడెంటౌన్: కేబుల్ కనెక్షన్‌కు చెందిన యాంటీనాను అమర్చుతూ బిల్డింగ్ పైనుంచి జారిపడి బత్తిని సాగర్ (35) మృతి చెందిన ఘటన కొత్తగూడెం పట్టణంలోని రైటర్‌బస్తీ గొల్లగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సూజాతనగర్‌కు చెందిన సరోజిని, వీరయ్య దంపతుల పెద్దకుమారుడు బత్తిని సాగర్ (41) కేబుల్ టీవీ, డిష్ టీవీ కనెక్షన్‌లు ఇస్తుంటాడు. ఓ ఇంట్లో కనెక్షన్ ఇస్తున్న సమయంలో సెకండ్ ఫ్లోర్ నుంచి కాలు జారి కింద పడి, తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే సాగర్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య శిరీష, ఐదేళ్ల చిన్నారి లాస్య ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

బాత్‌రూమ్‌లో జారిపడి వ్యక్తి మృతి


బత్తిని సాగర్ (ఫైల్)

కొత్తగూడెంటౌన్: బాత్‌రూమ్‌కు వెళ్లి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన పంజాబ్‌గడ్డలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పంజాబ్‌గడ్డకు చెందిన భైరిమల్ల మధుసూదన్ (41) పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. స్నానం చేయడానికి బాత్‌రూమ్‌కు వెళ్లి జారి కిందపడ్డాడు. గొంతుకు తీవ్రగాయం కావడంతో అయన్ను కొత్తగూడెం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కూమారుడు ఉన్నారు.

క్లుప్తంగా

అన్నపూర్ణాదేవిగా పెద్దమ్మతల్లి


అన్నపూర్ణాదేవి అలంకరణలో పెద్దమ్మతల్లి

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. కాగా, బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారి అలంకరణ విశిష్టతను వివరించారు.

చండీదేవిగా మారెమ్మతల్లి దర్శనం


చండీదేవి అలంకరణలో అమ్మవారు

ఖమ్మంరూరల్ : మండలంలోని రెడ్డిపల్లి శ్రీ మారెమ్మతల్లి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. కాగా, బుధవారం అమ్మవారు చండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో చండీహోమం, సాయంత్రం కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కాశావజ్జుల రామశర్మ, అర్చకులు గండికోట నరేందర్ శర్మ, కాశావజ్జుల సతీష్ శర్మ, చక్రధర్ శర్మ, రాహుల్ శర్మ, శ్రీనివాస్ శర్మతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


19 మండలాల్లో ఆదిసేవా కేంద్రాలు

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని 19 మండలాల్లోని 130 గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్ పథకాన్ని ఈనెల 30 వరకు నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలో ఆది సేవా కేంద్రాలు ప్రారంభిస్తున్నామని పీఓ బి. రాహుల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దుమ్ముగూడెం, ఆళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి, అశ్వాపురం, అశ్వారావుపేట, బూర్గంపాడు, దమ్మపేట, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి, ములకలపల్లి, పాల్వంచ, పినపాక, సుజాతనగర్, టేకులపల్లి, ఇల్లెందు తదితర మండలాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఆది కర్మయోగి అభియాన్ రచ్చబండ కార్యక్రమాలకు నియమితులైన నోడల్ ఆఫీసర్లు, ప్రత్యేక అధికారులు డీఎంటీలు, బీఎంటీలతో పాటు ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరై ఆది సేవా కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. గ్రామాల్లో కాలినడకన ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకోవాలని, గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల సమక్షంలో తీర్మానించి ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు.

కిన్నెరసానికి కొనసాగుతున్న వరద

5వేల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల


కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న వరద నీరు

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 7వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో రిజర్వాయర్‌లో నీటిమట్టం బుధవారం నాటికి 405.80 అడుగులకు పెరిగింది. దీంతో ఒక గేటు ఎత్తివేసి 5వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు డ్యామ్ సైట్ పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు.

ముక్తార్ పాషా ఆశయాలు సాధించాలి


మాట్లాడుతున్న గౌని నాగేశ్వరరావు

పాల్వంచ: కార్మిక ఉద్యమ నేత ముక్తార్ పాషా ఆశయాలు సాధించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి జిల్లా కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ముక్తార్ పాషా ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత చదువు చదివి, ఉన్నత కుటుంబంలో పుట్టి సమాజంలో కష్టాలు అనుభవిస్తున్న వారి కోసం ఉద్యమించారని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఏరియా కార్యదర్శి మంకేన వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఎర్రం శ్రీను, నాయకులు కె.నరసింహారావు, మల్లేష్, వీర, గోపి, రమేష్, సురేష్, భాస్కర్ పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు..


ఖమ్మంలో ప్రధాన రహదారి వెంట చిరువ్యాపారాలు

- 'పీఎం స్వనిధి' ద్వారా వీధి వ్యాపారులకు రుణాలు
- లోక్ కల్యాణ్ మేళాల ద్వారా మంజూరు
- 'మెప్మా' ఆధ్వర్యాన కార్యాచరణ ఖరారు

ఖమ్మంమయూరిసెంటర్: పీఎం స్వనిధి పథకం వీధి వ్యాపారుల జీవితాల్లో నూతన అధ్యాయాన్ని సృష్టిస్తోంది. ఈ పథకం కేవలం ఆర్థిక సాయం అందించడమే కాకుండా, వృత్తిపరంగా, సాంకేతికంగా వారి వ్యాపారాలను అభివృద్ధి చేసేందుకు తోడ్పడుతుంది. ఈ పథకం కింద వీధి వ్యాపారులు సులభంగా రుణాలు పొందేలా ప్రభుత్వం 'లోక్ కల్యాణ్ మేళా' ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లాలోని ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీల్లో వీధి వ్యాపారులకు రుణం ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు.

వ్యాపారులకు దన్నుగా నిలిచేలా..

వీధి వ్యాపారాలు చేసుకునే వారికి ప్రభుత్వం దన్నుగా నిలిచేలా లోక్ కల్యాణ్ మేళా నిర్వహణకు సన్నాహాలు చేసింది. గతంలో ఈ మేళా నిర్వహించినప్పటికీ కొంత కాలంగా నిలిచిపోయింది. తిరిగి ఈ పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం.. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు వీధి వ్యాపారులకు రుణాలు అందించాలని నిర్ణయించింది. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారులకు మాత్రమే రుణాలు ఇచ్చేలా లక్ష్యాలను నిర్దేశించారు. మొదటిసారి రుణం తీసుకునేవారికి రూ.15,000, సకాలంలో తిరిగి చెల్లించే వారికి రెండోసారి రూ.25,000, మూడోసారి తీసుకునేవారికి రూ.50,000 వరకు రుణాలు మంజూరు చేస్తారు. అత్యంత తక్కువ వడ్డీ రేటుతో, ఎలాంటి హామీ లేకుండా రుణాలివ్వడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఇక రూ.50 వేల పైగా రుణం తీసుకుని చెల్లించిన వారికి క్రెడిట్ కార్డులు అందజేయనున్నారు. ఈ కార్డుల ద్వారా రూ.30 వేల వరకు వినియోగించుకునే అవకాశం ఉంది. తద్వారా వీధి వ్యాపారులను వడ్డీల పేరుతో దోపిడీ నుంచి కాపాడి, స్వతంత్రంగా ఎదగడానికి అవకాశం కల్పించనుంది.

సాంకేతికతతో ఆధునిక వ్యాపారం

ఆధునిక డిజిటల్ యుగంలో పీఎం స్వనిధి పథకం వీధి వ్యాపారులను డిజిటల్ లావాదేవీల వైపు ప్రోత్సహిస్తోంది. యూపీఐ లాంటి చెల్లింపు పద్ధతులపై వారికి శిక్షణ ఇవ్వనున్నారు. దీనివల్ల కస్టమర్ల నుంచి నగదు రహిత చెల్లింపులు స్వీకరించడం సులభం అవుతుంది. ఈ డిజిటల్ లావాదేవీల వల్ల వారికి బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక లావాదేవీల చరిత్ర ఏర్పడుతుంది. ఇది భవిష్యత్‌లో మరింత ఎక్కువ రుణాలు పొందడానికి సహాయపడనుంది.

సమగ్ర ప్రయోజనాల వేదిక

లోక్ కల్యాణ్ మేళా అనేది పీఎం స్వనిధి లబ్ధిదారుల కోసం నిర్వహించే ఒక ప్రత్యేక కార్యక్రమం. ఈ మేళాలో కేవలం రుణాల మంజూరు మాత్రమే కాకుండా, వారి జీవితాలకు అవసరమైన అనేక ఇతర ప్రభుత్వ పథకాలను కూడా ఒకేచోట అందించనున్నారు. పీఎం సురక్షా బీమా యోజన పథకం ద్వారా వారికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించనున్నారు. పీఎం జీవన్ జ్యోతి యోజన పథకం ద్వారా జీవిత బీమా కవరేజ్ అందనుంది. శ్రమశక్తి పోర్టల్ అసంఘటిత రంగ కార్మికుల వివరాలు నమోదు చేసుకోవడానికి ఉపయోగపడనుంది. వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సులభంగా లభిస్తాయి.

లోక్ కల్యాణ్ మేళాలో వీధి వ్యాపారులకు అందించే రుణాలిలా..

కార్పొరేషన్/ మున్సిపాలిటీ	రుణాల పంపిణీ లక్ష్యం
ఖమ్మం	334
మధిర	25
సత్తుపల్లి	25
వైరా	25
మొత్తం	409

కలవరపెడుతున్న ఆత్మహత్యలు

- క్షణికావేశంతో గాలిలో దీపాల్లా ప్రాణాలు
- గత ఆరు నెలల్లో 400 మంది బలవన్మరణం
- ముందుగా గుర్తిస్తే అడ్డుకునే అవకాశం



జిల్లాలో ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

- తండ్రి సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఓ పదో తరగతి విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- ఇష్టం లేని సంబంధం చేస్తున్నారని భవిష్యత్ ఉన్న ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది.
- ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో ఇద్దరు చిన్నారులతో ఆనందంగా గడుపుతున్న భార్యాభర్తల మధ్య ఏర్పడిన చిన్న గొడవతో భార్య ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో అప్పటివరకు తల్లితో ఆడుకున్న చిన్నారులకు తట్టుకోలేకపోయారు.
- మూడు నెలల క్రితం ఖమ్మం రైల్వే స్టేషన్‌లో కీమెన్‌గా పనిచేస్తున్న ఉద్యోగిని భర్తతో గొడవపడి క్షణికావేశంలో ఉరి వేసుకుంది. ఇది తెలిసి భర్త కూడా ఆమె ఉరి వేసుకున్న ఫ్యాన్‌కే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- ఖమ్మం బ్యాంక్‌కాలనీలో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో పట్టించుకోనే వారు లేక వృద్ధుడు భార్యను హతమార్చి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఖమ్మంక్రైం: జిల్లాలో కొంతకాలంగా చోటుచేసుకుంటున్న ఆత్మహత్యలు అందరినీ కలవర పెడుతున్నాయి. ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో కుటుంబ కలహాలతోపాటు, ఆర్థిక, ప్రేమ వ్యవహారం, వివిధ కారణాలతో క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్నారు. వీరిలో విద్యార్థులు, యువతే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది జిల్లాలో 1000 మంది బలవన్మరణానికి పాల్పడగా.. ఈ ఏడాది ఆరు నెలల్లో 400 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

మానసిక ఒత్తిడే ప్రధాన కారణం..

క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడే ఎక్కువ మందిలో మానసిక ఒత్తిడే ప్రధాన కారణం. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోలేక, వినేవారులేక, తమ సమస్య చెప్పుకుంటే పరువు పోతుందేమోనని భావించి తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతూ ఉంటారు. దీంతో క్షణికావేశంలోనే ఆత్మహత్యకు పాల్పడుతూ ఉంటారు.

గత ఆరు నెలల్లో జరిగిన ఆత్మహత్యలు, కారణాలు

కారణం	బలవన్మరణం
కుటుంబ కలహాలు	29
అనారోగ్యం	16
దీర్ఘకాలిక వ్యాధులు	51
మద్యానిక బానిసై..	40
ప్రేమ విఫలమై	03
పరీక్షల్లో ఫెయిల్	01
మానసిక స్థితి సరిగ్గా లేక	13
అప్పులు	22
ఇతర కారణాలు	219

కొన్ని లక్షణాలతో గుర్తించొచ్చు...



ఆత్మహత్య చేసుకోవాలనే వారిని ముందుగానే గుర్తించవచ్చు. ఒంటరిగా ఉండే ప్రయత్నం చేయడం, పదేపదే చనిపోతే బాగుండని అంటుండడం.. చిన్నచిన్న కారణాలకే కోపం తెచ్చుకుంటే వారిపై ఓ కన్నేయాలి. అలాగే, ఇష్టమైన వారికి పదేపదే వీడ్కోలు పలుకుతున్నా కుటుంబసభ్యులు, స్నేహితులు గమనించి సమస్యను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అంతేకాక వారు ఒంటరి వాళ్లు కాదని భావన కలిగించాలి. దీంతో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన తగ్గిపోతుంది. అందమైన భవిష్యత్ కళ్ల ముందు ఉందని నమ్మకం కల్పించాలి. అయినా మార్పు రాకపోతే సైకాలజిస్టును సంప్రదించాలి.

– సౌమ్యాగ్రేస్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సైకియాట్రిస్ట్ విభాగం, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

బీఆర్‌ఎస్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు


ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారవ బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి తదితరులు బతుకమ్మలు ఎత్తుకుని వేడుకల్లో పాల్గొన్నారు.

– ఖమ్మంమయూరిసెంటర్

అందరి చూపూ.. ఫారెస్టు గ్రౌండ్ వైపు


ఇల్లెందులోని ఫారెస్టు గ్రౌండ్


జేకే సింగరేణి గ్రౌండ్

ఇల్లెందు: ఇల్లెందులో దసరా ఉత్సవాలు అంటే మైసూర్‌ను తలదన్నేలా నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఈసారి ఇల్లెందులో కొంతమంది జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో మరికొంత మంది ఫారెస్టు గ్రౌండ్‌లో నిర్వహించాలని కోరుకుంటున్నారు. ఫారెస్టు గ్రౌండ్ కోర్టు పరిధిలోకి వెళ్లినందున జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌కు మార్చిన విషయం విదితమే. అయితే ఇటీవల రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇల్లెందు నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ముడత వెంకట్‌గౌడ్ నేతృత్వంలో ప్రతినిధి బృందం ఓ వినతిపత్రం అందజేసింది. ఫారెస్టు గ్రౌండ్ కోర్టుకు అవసరం లేకపోతే మున్సిపాలిటీకి అప్పగించాలని మళ్లీ దసరా ఉత్సవాలు ఫారెస్టు గ్రౌండ్‌లో నిర్వహించుకునేలా చూడాలని వినతి పత్రంలో కోరారు. దీంతో నాటి నుంచి దసరా ఉత్సవాలు మళ్లీ ఫారెస్టు గ్రౌండ్‌లో జరుగుతాయని అంతా ఆశపడుతున్నారు. అయితే ఇంత వరకు ఉత్సవాలు ఏ గ్రౌండ్‌లో జరుగుతాయో తెలియని పరిస్థితి. దీనికి తోడు ఈసారి మున్సిపల్ పాలక వర్గం కూడా లేదు. ఏటా వినాయక ఉత్సవాలు, బతుకమ్మ, దసరా ఉత్సవాలు మున్సిపల్ పాలకవర్గం నిర్వహించటం ఆనవాయితీ. వినాయక ఉత్సవాలకు పట్టణంలో విగ్రహాలకు వీడ్కోలు పలికేందుకు ప్రధాన సెంటర్‌లో స్టేజీ నిర్మాణం చేసి దాని మీదుగా హారతీ ఇచ్చి వినాయక విగ్రహాలకు వీడ్కోలు పలకటం, స్టేజీ మీద అలరించేలా విభిన్న తరహాలో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించటం జరుగుతుంది. ఇక బతుకమ్మ ఉత్సవాలు సైతం చెరువు కట్ట వద్ద స్టేజీ, లైటింగ్ ఏర్పాటు చేసి ఘాట్‌లో బతుకమ్మలను నిమజ్జనం చేయటం జరుగుతుంది. ఇక దసరా ఉత్సవాలకు గ్రౌండ్‌లో స్టేజీ నిర్మాణం చేసి సాంస్కృతిక కార్యక్రమాలు మిమిక్రీ, రావణవధ, షమీ పూజ, పాలపిట్ట దర్శనం, జమ్మిపూజ, దుర్గామాత విగ్రహాలకు వీడ్కోలు లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. అయితే పట్టణంలోని ఫారెస్టు గ్రౌండ్‌కు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా గ్రౌండ్ చుట్టూ బయటకు వెళ్లే మార్గాలు ఉండటం వల్ల ప్రశాంతంగా జరుగుతుందని, పట్టణానికి సెంటర్ పాయింట్‌లో ఉంటే అనువుగా ఉంటుందని అంతా ఫారెస్టు గ్రౌండ్‌లో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇక జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ ఒకటే ప్రధాన మార్గం ఉండటం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏటా సింగరేణి క్వార్టర్ల మధ్యలో రహదారులన్నీ వాహనాలతో నిండి స్థానికులకు ఇబ్బందిగా మారుతోందని అంటున్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ముందు సభ నిర్వహించి అందరి అభిప్రాయం సేకరించటం, నిర్వహణ కోసం సమావేశం నిర్వహించటం జరుగుతుంది. ఈసారి ఇంత వరకు సమావేశాలు జరగలేదు. దీంతో భక్తుల్లో దసరా ఉత్సవాల మీద అయోమయం నెలకొంది

ఫారెస్టు గ్రౌండ్ అనుకూలం..



జేకే సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించటం వల్ల ఉత్సవాల ప్రాధాన్యత కల్పోయింది. ఫారెస్టు గ్రౌండ్‌లో కోర్టు నిర్మాణం లేనందున ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని ఫారెస్టు గ్రౌండ్‌లోనే నిర్వహిస్తే పట్టణానికి మేలు జరుగుతుంది.

– కొల్లి సంజీవరెడ్డి, దసర ఉత్సవ కమిటీ సభ్యుడు, ఇల్లెందు

ఈసారి ఉత్సవాలు మార్చాలి..



రథాలతో వచ్చే భక్త మండలిలకు ఫారెస్టు గ్రౌండ్ అనుకూలంగా ఉంటుంది. రథాలు జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లోకి వెళ్లటం కష్టంగా ఉంటుంది. దసరా ఉత్సవాలు అంటే రథాలకు జమ్మిపూజ, పాలపిట్ట దర్శనానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి.

– కటకం పద్మావతీ, మాజీ కౌన్సిలర్, ఇల్లెందులపాడు

అన్నపూర్ణగా అమ్మవారి దర్శనం


సుభాష్‌నగర్‌లో అమ్మవారికి పూజ చేస్తున్న మహిళలు

దుర్గామాత శరన్నవరాత్రోత్సవంలో భాగంగా బుధవారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. మండలంలోని సుభాష్‌నగర్, ఇందిరానగర్ గ్రామాలలో భక్తులు మండపంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– ఇల్లెందురూరల్

కుల వ్యవస్థ నిర్మూలనకు పాడుపడదాం..



మాట్లాడుతున్న రంగారెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): మహాత్మ జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజస్ఫూర్తితో కుల నిర్మూలనకు పాడుపడదామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సత్యశోధక్ సమాజ్ ఏర్పడి 152 సంవత్సరాలు పూర్తియిందన్నారు. భారతదేశంలో సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని కొనియాడారు. బ్రాహ్మణాధిపత్య సమాజంలో దళితులను, వెనకబడిన వర్గాలను తీవ్రంగా అణచివేస్తున్న సమయంలో వాటికి వ్యతిరేకంగా పూలే పోరాడాలని తెలిపారు. సావిత్రీబాయి పూలేకి చదువు నేర్పి బాలికల కోసం భారతదేశంలో మొట్ట మొదటి పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొని సావిత్రీబాయి పూలే బాలికలకు విద్యను అందించినట్లు చెప్పారు. భారతదేశంలో 200 సంవత్సరాలు పరిపాలించిన బ్రిటీష్ సామ్రాజ్యవాదులు కూడా కుల నిర్మూలన కోసం పాడుపడకుండా వారి అవసరాల కోసం కులమతాలను ఉపయోగించుకున్నారని విమర్శించారు. భారతదేశంలో కులవ్యవస్థ సామాజిక ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఉందన్నారు. ఈ సదస్సులో నాయకులు చంద్ర అరుణ, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, జిల్లా కార్యదర్శి, ముద్దా భిక్షం, పెద్దబోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సా.. మాకెందుకు?

- మార్కెట్ల పన్ను ఎగవేతకు కొందరి పన్నాగం
- ఫలితంగా రైతులకు మద్దతు ధరలో నష్టం
- ఏటా రెన్యూవల్‌కు పలువురి విముఖత


మార్కెట్ కార్యాలయం

ఇల్లెందు: వ్యాపారం చేయాలంటే అనుమతి ఉండాలి. అందుకు క్రయవిక్రయ అనుమతి లైసెన్సు పొందాలి. పొందిన లైసెన్సుకు ఏటా ఏఏ పంట ఎంత కొనుగోలు చేశారో మార్కెట్ ఫీజు చెల్లించాలి. ఆ తర్వాత వచ్చే ఏడాది క్రయ విక్రయాలకు మళ్లీ రెన్యూవల్ చేసుకోవాలి. ఇదీ తంతు.. కానీ, చాలా మంది వ్యాపారులు ఒక దఫా మార్కెట్ యార్డు కార్యాలయం నుంచి లైసెన్సు తీసుకుని రెన్యూవల్ చేయించుకోకుండా అదే లైసెన్సు పేరుతో వ్యాపారం సాగిస్తున్నారు. ఇక ఏఏ పంట ఎంత? ఏ రైతు వద్ద ఏ పంట కొనుగోలు చేసింది? కొనుగోలు చేసిన పంటను ఏ వ్యాపారికి విక్రయించింది? లాంటి సమాచారం రిజిస్టర్‌లో నమోదు చేయరు. కనీసం ఏ పంటకు ఎంత మద్దతు ధర చెల్లించారో కూడా ఎక్కడా నమోదు చేయరు. ఇలా లైసెన్సులు రెన్యూవల్ చేసుకోకుండా దర్జాగా మార్కెట్‌లో వ్యాపారం చేసే వారు కోకోల్లలు. మార్కెట్ శాఖ పర్యవేక్షణ లేకపోవటం వల్ల ఈ దుస్థితి వచ్చింది. వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఉన్నా ఇంతవరకు ఒక్క దఫా మార్కెట్‌ల పరిస్థితిపై సమీక్ష నిర్వహించలేదు.

జిల్లాలో 141 మంది లైసెన్సుదారులు

జిల్లాలో ఆరు వ్యవసాయ మార్కెట్‌లలో 141 మంది లైసెన్సు పొందిన వ్యాపారులు ఉండగా ఇల్లెందులోనే 70 మంది వరకు ఉన్నారు. ఇక ఊరుకు 10 మందికి పైగా అనుమతి లేని జీరో వ్యాపారం చేసే వారే ఉన్నారు. వీరిలో చాలా మంది గతంలో లైసెన్సు తీసుకుని రెన్యూవల్ చేసుకోని వారు కూడా జీరో దందాలో ఉన్నారు. పేరుకు వ్యాపారులకు అనుమతులుంటాయి. కానీ, చాలామంది క్రయవిక్రయాలు నమోదు చేయరు. ఏడాది మొత్తం వ్యాపారం చేస్తారు. మార్కెట్ ఫీజు ఎగనామం పెట్టేందుకు రిజిస్టర్లు ఉండవు. రైతుల పేరుతో రశీదులు సృష్టించి ఎగుమతులు చేసుకుంటున్నారు. శాఖల మధ్య సమన్వయం లేక మార్కెట్ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు. వ్యాపారులకు వ్యవసాయ శాఖ పంట పండినట్లు ఒక రశీదు ఇస్తుంది. ఆ రైతు భూమి నుంచి పండిన పంటనే తరలించుకుపోతున్నట్లు రెవెన్యూ శాఖ మరో రశీదు ఇస్తుంది. ఒక్కోసారి చెక్ పోస్టుల్లో కూడా ఏమీ చేయలేకపోతున్నారు. జీరో దందాకు చెక్ పెడితే మార్కెట్ ఆదాయం పెరుగుతుంది.

సీజనల్‌గా సాగే మార్కెట్లుగా..

జిల్లాలో 5,92,264 ఎకరాల్లో పంటల సాగు జరిగింది. 1,39,169 మంది రైతులు ఉన్నారు. వరి 42 వేల ఎకరాలు, పత్తి 2.11 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 84 వేల ఎకరాలు, పెసర 346 ఎకరాలు, కంది 1,071 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలోని అన్ని వ్యవసాయ మార్కెట్లను సీజనల్‌గా సాగే మార్కెట్లుగా మార్చారు. ఏడాది పొడవునా ఏ ఒక్క మార్కెట్‌లో క్రయవిక్రయాలు సాగడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం సాధించాలంటే కేవలం చెక్‌పోస్టులను వాడుకుంటున్నారు. భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, దమ్మపేట, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల, ఇల్లెందు మార్కెట్ యార్డులు ఉన్నాయి. 2025 – 26 ఏడాదికి జిల్లా లక్ష్యం రూ.22 కోట్లుగా నిర్ణయించారు. ఆదాయం కోసం చెక్ పోస్టుల్లో ప్రైవేట్ గార్డులను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా రాబడుతున్నారు. ఇక అధికారులంతా కాలక్షేపం చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

గత ఏడాది లక్ష్యం ఇలా..

బూర్గంపాడు రూ.6. 25 కోట్లు, దమ్మపేట రూ. 3.67 కోట్లు, ఇల్లెందు రూ.5.16 కోట్లు, భద్రాచలం రూ.1.94 కోట్లు కొత్తగూడెం రూ. 3.47 కోట్లు, చర్ల రూ.2.12 కోట్లు సాధించారు.

పంట మద్దతు ధరలు ఇలా ..

క్వింటా ధాన్యం (సాధారణ) రూ.2,369, ధాన్యం (గ్రేడ్-ఏ) రూ.2,389, మొక్కజొన్న రూ.2,400, పత్తి (పొడవైన) రూ.7,710, పత్తి (మధ్యస్థ) రూ.8,110, జొన్నలు (హైబ్రిడ్) రూ.3,699, జొన్నలు (మాల్దండి) రూ.3,749, సజ్జలు రూ.2,775, రాగులు రూ.4,886, కందులు రూ.8 వేలు, పెసలు రూ.8,768, మినుములు రూ.7,800, వేరుశనగ రూ.7,263, పొద్దు తిరుగుడు రూ.7,720, సోయాబీన్ రూ.5,328, నువ్వులు రూ.9,846గా ఉన్నాయి.

వ్యాపారులందరికీ లైసెన్సులు ఉండాలి



గ్రామగ్రామాన పంటలు కొనుగోలు చేసే వ్యాపారులందరికీ లైసెన్సులు ఉండాలి. మార్కెట్లలో క్రయ విక్రయాలు జరిగేలా చూడాలి. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు లభించేలా చూడాలి. అధికారులు రైతులకు న్యాయం జరిగేలా పంటల మద్దతు ధరలు అమలయ్యేలా చూడాలి.

–ఉపేందర్, బొజ్జాయిగూడెం, ఇల్లెందు మండలం

లైసెన్సుల రెన్యువల్‌పై దృష్టి..



ఇల్లెందు మార్కెట్ పరిధిలో 8 మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 70మంది వ్యాపారులకు లైసెన్సులు ఉన్నాయి. అన్ని లైసెన్సులు రెన్యూవల్ అయ్యేలా చూస్తున్నాం. వ్యాపారం చేసే ప్రతీ ఒక్కరికి లైసెన్సు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. క్రయవిక్రయాల లెక్కలు పక్కాగా రాసేలా చూస్తున్నాం.

–ఇ.నరేశ్, మార్కెట్ కార్యదర్శి, ఇల్లెందు